# మా చిన్నారి సలహా

దేశంలో జనాభా వలెనే ధరలు కూడా రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. నిత్యజీవితావసర వస్తువులకు నిన్న ఉన్న ధర ఈనాడు ఉండటంలేదు అంత దాకా ఎందుకూ, ఒకే మార్కెట్‌లోనే ప్రొద్దున పదిగంటలకు ఉన్న ఉల్లి పాయల ధర సాయింత్రం అయిదు గంటలకే అయిదు పైసలు పెరిగిన నిదర్శనాలున్నాయి. దేశంలో పెచ్చరిల్లి పోయే అన్యాయాలకూ, అక్రమాలకూ, అవినీతికీ, లంచగొండితనానికీ, బ్లాక్ మార్కెటింగ్‌కూ, హోర్డింగ్‌కూ – ఈ ధరల పెరుగుదలకూ పరస్పర సంబంధం ఉన్నదీ లేనిదీ అటుంచి, మా బోటి మధ్య తరగతి ఉద్యోగస్థులకు మటుకు రోజులు గడవటం అతంత మాత్రంగా ఉంది. జీతాలు కుందేలు నడకతో పెరుగుతూంటో, ధరలు పందెపు గుర్రం వేగంలో పెరుగుతున్నాయి. నెలసరి ఆదాయానికీ, వ్యయానికీ మధ్య అంతకంతకూ అగాధం పెరిగిపోతూఉంటే, కుటుంబపు బడ్జట్‌ను సర్దాబాటు చేయడమెట్లా ?

అరగంట సేపు ఆలోచించి, అరు సిగరెట్లు తగలేసి, మా ఆవిడతో సుదీర్ఘంగా చర్చలు జరిపి – కుటుంబ ఖర్చులను తగ్గించే పథకాన్ని తయారు చేశాను. మాది ఎర్రత్రికోణపు మార్కు సంసారం. ఇద్దరు మగ పిల్లలు ; ఒక ఆడపిల్ల. పెద్దవాడు హైస్కూల్లో ఆరో క్లాసు చదువుతున్నాడు. అమ్మాయి నాలుగో క్లాసు చదువుతున్నది. అయిదేళ్ల చిన్నవాడు అప్పర్ కేజి చదువుతున్నాడు. ముగ్గురూ రోజూ బస్సులో ఉదయం 8 గంటలకు స్కూలుకు వెళ్లి, సాయంత్రం 4 గంటలకు ఇంటికి వస్తారు. నాకు అన్ని కోతలూ పోగా నెలకు 615 రూపాయలు చేతికి వస్తాయి.

నేనూ, నా భార్యా, పిల్లలూ అందరమూ కూర్చుని కుటుంబ ఖర్చులు తగ్గించే పథకం మీద చర్చలు జరుపుతున్నాము.

"నెయ్యి కిలో పదహారు రూపాయలైంది. మనకు నెలకి మూడు కిలోల నెయ్యి పడుతున్నది. నేతి వాడకం బాగా తగ్గించి వేస్తే, నెలకు అరకిలో నెయ్యిని మాత్రమే వాడితే, నలభై రూపాయాలు ఆదా అవుతాయి. ఏమంటావు లక్ష్మి !" అన్నాను నేను.

"మీ ఐడియా బావుంది" అన్నది లక్ష్మి అంగీకారంగా.

"ఆరోగ్య సూత్రాల దృష్ట్యా కూడా నెయ్యిని అంతగా వాడటం మంచిది కాదు. కొవ్వు పేరుకుపోతుంది, ఎన్నో

పద్మ శీల

జబ్బులు వస్తాయి. అట్లాగే కూరల్లో కూడా నూనె తగ్గించాలి. పిండివంటలు మానేయాలి. దీనివల్ల నూనె ఖర్చుకూడా సగానికి సగం తగ్గుతుంది.'' అన్నాను నేను సీరియస్‌గా.

మా ఆవిడ ఆట్టే అభ్యంతరం చెప్ప లేదు. రెండు కిలోల నూనె ఖర్చును తగ్గించుకోవచ్చునన్నది. అయితే ముగ్గురు పిల్లలు మాత్రం ఆముదం పుచ్చుకొన్న మొహాలు పెట్టారు.

''ఏమిట్రా ?" అన్నాను పెద్దవాణ్ణి."

"నెయ్యిలేనిదే నేము ముద్ద ఎత్తం" అన్నాడు పెద్దవాడు.

"మాకు అన్నం స యి ం చ దు'' అన్నది అమ్మాయి.

చిన్నవాడు గోడకేసి చూస్తూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు, తన అభి ప్రాయాన్ని చెప్పకుండా,

"డాడీ ! నువ్వు సిగిరెట్లు మానెయ్య కూడదూ ! నెలకు వందరూపాయలు కలిసివస్తాయి" అన్నాడు పెద్దవాడు టపాకాయ పేల్చినట్టుగా.

నా గుండెలో తుపాకిగుండు దూసుకు పోయినట్లయింది. ఇరవై ఏళ్ల నుంచీ నీడలాగా తోడుగా వస్తూన్న అలవాటు. దాన్ని మానడం మాటలా ?

"డాడీ ! సిగిరెట్లు మానేయాలి" అన్నది అమ్మాయి కూడా బిగ్గరగా.

పచ్చి కొబ్బరిముక్క గొంతులో ఇరుక్కున్నట్లుగా మా ఆవిడ కేసి చూశాను.

"తప్పదు" అన్నట్లు ఆవిడ తల ఆడించింది.

ప్రభుత్వం వారి ప్రతి బడ్జట్‌లో ఆర్థిక మంత్రిగారి దృష్టిలోపడి అత్యంత ప్రియంగా తయారైన సిగిరెట్లను మాని వేయడంలో ఔచిత్యం కనబడి 'అట్లాగే' అన్నాను.

అందరూ చప్పట్లు కొట్టారు.

"ఉగాది పండక్కు నాకు కొత్తచీర అక్కర్లేదు" అన్నది మా ఆవిడ.

సంతోషించాను.

"మేం బోర్నవిటా మానివేసి ఒట్టి పాల్ తాగుతాం," అన్నాడు పెద్దవాడు.

"రోజూ చాకెలెట్లు కొనమని నేను ఏడ్వను డాడీ !" అన్నది అమ్మాయి.

ఆరేళ్ల మా చిన్నవాడు తన దీర్ఘ మైన ఆలోచననుంచి తేరుకొని-"డాడీ ! రేపట్నించీ నేను స్కూలుకుపోను. బస్సు ఛార్జీలు, స్కూలు ఫీజు మిగులుతాయి" అన్నాడు చంకలెగరవేస్తూ.

—-—